## మినీకథ

### ప్రేమ ఫలెంచెనుగా...

"మీ అమ్మాయిని నేను మనస్ఫూర్తిగా ప్రేమించేనండీ. మీరు అనుమతిస్తే పెళ్ళి చేసుకుంటాను" ఓరోజు ధైర్యంచేసి అనేశాడు సుబ్బారావు.

"అలాగా— సంతోషం! మా ఏడుగు రమ్మాయిల్లో ఎవరిని?" సంతోషంగానే అడిగాడు కుటుంబరావు.

"అదే పేరు తెలీదండీ. రోజూ ఉదయాన్నే జడనిండా పువ్వులు పెట్టుకుని, మీ ఇంటి ముందు అందంగా ముగ్గు వేస్తుంటుందే ఆ అమ్మాయి."

కుటుంబరావు కాస్త నిరుత్సాహపడ్డట్టు కనిపించి "సరే అలాగే. కానీ, ఒక్క షరతు- అమ్మాయిని రోజూ మా ఇంటికి ఉదయం సాయంత్రం చెరోగంట పంపుతుండాలి."

"ఒకే వీధిలో వున్నాం. అదేమంత మహాభాగ్యం. ఆమాత్రం కన్న హృదయాన్ని అర్థం చేసుకోగలనులెండి" అన్నాడు సుబ్బారావు తబ్బిబ్బవుతూ.



"మాట తప్పితే చాలాయిబ్బంది నాయనా. ఈ రోజుల్లో పని పిల్లలు దొరకడం చాలా కష్టంగా వుంది. ఆ అమ్మాయి మా పనిమనిషి!" చల్లగా అన్నాడు కుటుంబరావు.

—రాజెష్ఠి

## చాయ్ పానీ

"బస్సుకి టైమయింది. త్వరగా పోనీయ్ కరీం" అంటూ కరీం రిక్షాలో కూర్చున్నాను. కరీం మా ఇంటి పక్కనే వుంటాడు. అతడెప్పుడూ చాలా హుషారుగా, లైవ్లీగా వుంటాడు. నేను కూర్చోగానే "మేరే అంగనేమే తుమ్హారా క్యా కామ్ హై" అంటూ పాడుతూ రిక్షాను స్టార్ట్ చేశాడు. రోడ్డు కిరు పక్కలున్న తోటి రిక్షా వాళ్ళతో జోక్ చేశాడు నవ్వాడు, నవ్వించాడు.

మా ఊరెళ్ళాలంటే బస్సు దిగాక ఓ 8 కిలోమీటర్లు ఎడ్లబండ్లో ప్రయాణం చెయ్యాలి. నేను బస్సు దిగగానే రాజయ్య కనిపించి నా చేతిలో ఉన్న బ్రీఫ్‌కేసును తీసుకొని బండ్లో పెట్టాడు. బండికట్టి. నేను కూర్చోగానే హుషారుగా చిరుతల రామాయణం పాడుతూ ఎడ్లను అదిలించాడు. తర్వాత మా ఊరి కబుర్లు చెప్పాడు. రాజయ్య ఐదారేళ్ళుగా మా నాన్నగారి దగ్గర పాలేరుగా పని చేస్తూ నాతో చాలా చనువుగా ఉంటాడు

అక్కడ కరీం....ఇక్కడ రాజయ్య— ఇద్దరూ చాలా పేదవాళ్ళే—సమాజపు అట్టడుగున జీవిస్తున్నవాళ్ళే. దారిద్ర్యపు రేఖకు కింద బతుకుతున్నవాళ్ళే. ఇలాంటి వాళ్ళను గూర్చి మన కవులు, రచయితలు చాలా సాహిత్యాన్నే సృష్టించారు. వీళ్ళంతా ఎప్పుడూ దీనంగా, హీనంగా ఉంటారని, సరిపోయేంత తిండి, బట్టా లేక ఎప్పుడూ యేడుస్తూ ఉంటారని, వీళ్ళ భార్యలు. పిల్లలూ ఎప్పుడూ యేదో ఒక జబ్బుతో బాధపడ్తూ ఉంటారని. వీళ్ళని డబ్బున్న వాళ్ళు ఎప్పుడూ యేదో రకంగా హింసిస్తూ ఉంటారని మన రచయితలు రాస్తుంటారు. ఇంతటి విషాదం రచయితల హృదయాల్లో ఉందా.... లేక వీళ్ళ జీవితాల్లో నిజంగా ఉందా అన్న సందేహం కల్గుతూ ఉంటుంది. అదృష్టవశాత్తు ఏ దీనుల గురించి. హీనుల గురించి. దగాపడిన తమ్ముళ్ళనుగూర్చి మన కవులు, రచయితలు బుర్రలు బద్దలు చేసుకొని కథలు, నవలలు. కవితలు రాస్తున్నారో వాళ్ళు మాత్రం ఈ రచనల్ని సాధారణంగా చదివే అవకాశం లేదు.

పేదవాళ్ళనుగూర్చి మన కవులు. రచయితలు వ్యక్తంచేసే బాధంతా కావాలని తెచ్చిపెట్టుకున్నదో లేక అలా బాధపడి వాళ్ళమీద కన్నీళ్ళను కురిపించి వాళ్ళనేదో వుద్ధరిస్తున్నా మనుకోవటం వల్లనో ఉత్పన్నమౌతున్నదే.

ఆర్థికంగా ఎంత పేదవాడైనా ఆ పేదవాడిలోకూడా జీవించే గుణం సహజంగా వుంటుందని మన రచయితలు గుర్తించాలి. సమాజం అట్టడుగున నివసించే వీళ్ళు కూడా ఎంతో లైవ్లీగా సజీవంగా ఉంటారు. వీళ్ళూ సినిమాలు చూస్తారు. పాటలు పాడ్తారు. జోక్స్ వేస్తారు. నవ్వుతారు. నవ్విస్తారు, ప్రేమిస్తారు. ద్వేషి



### అందరిలాంటి మనుషులు

స్తారు, జాలిపడ్తారు సానుభూతి చూపిస్తారు. పని చేసినంత సేపూ చేస్తారు. తర్వాత జీవితాన్ని వాళ్ళ వాళ్ళ పరిధుల్లో ఎంజాయ్ చేస్తారు. మధ్యతరగతి వాళ్ళల్లా నీతి, అవినీతి, స్టేటస్. ఈర్ష్య మొదలైన వాటితో సతమతమైపోరు. ప్రతి చిన్న విషయాన్ని గూర్చి గంటలకు గంటలు ఆలోచిస్తూ బుర్ర పాడుచేసుకోరు— ఎంతో ఆరోగ్యకరమైన జీవితం వాళ్ళది.

మన కవులు, రచయితలు రిక్షావాళ్ళను. పాలేర్లను, ప్రాస్టిట్యూట్స్‌ను. పని మనుషులను దీనులుగా హీనులుగా. మా కర్మమిట్లా కాలిందే అని యేడుస్తున్నట్టుగా కాకుండా లైవ్లీగా, హుషారుగా. వాళ్ళూ అందరిలాంటి మనుషులే....వాళ్ళూ నవ్వగలరు-ఎంజాయ్ చెయ్యగలరు. ప్రేమించగలరు-కామించగలరు — అన్నట్టుగా చిత్రిస్తే ఎంత సజీవమైన సాహిత్యం ఉత్పన్నమౌతుందో!

—నవీన్